
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 16 జూన్ 2024



ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ 7లో..


అధ్వానంగా రహదారి
విద్యార్థుల కష్టాలు పట్టని పాలకులు 7లో..

> “జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ చిరుద్యోగి. తనకొచ్చిన రూ. 12 వేలతో ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొ స్తున్నాడు. ఈ ఏడాది అతని పిల్లలు 6వ, 5వ తరగతులకు వస్తున్నారు. వారి భవిష్యత్తు బాగుంటుందని పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చే ర్పించాడు. అక్కడ ఫీజులే ఒకరికి రూ. 25 వేలు, మరొకరికి రూ. 20 వేలు. ఇవి కాక పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, నోటు పుస్తకాలు, రవాణా వం టివన్నీ లెక్క వేసుకుంటే ఇద్దరికీ కలిపి రూ. అర లక్షపైగా అవుతోంది. త నకొచ్చే జీతం ఇంటి ఖర్చులకే సరిపోతుంది. పిల్లల భవిషత్తు కోసం అ ప్పుచేసినా చదివించాల్సి వస్తుందని ఆ తండ్రి చెబుతున్నాడు.”

> “జగిత్యాల మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన మధ్య తర గతి కుటుంబానికి చెందిన ఓ రైతు కుమారుడు ఇటీవల తొమ్మిదో తరగతి పూర్తిచేశాడు. కుమారుడి భవిష్యత్తు బాగుంటుందని జగిత్యాలలోని ఓ ప్రై వేటు పాఠశాలలో పదో తరగతిలో చేర్పింద్దామని భావించాడు. అక్కడ ఫీజు, ఇతర ఖర్చులు ఏడాదికి సుమారు రూ. అర లక్షకు పైగా అవుతుం దని చెప్పడంతో అవాక్కయ్యారు. పిల్లవాడి భవిష్యత్తును ఆలోచించి మరో మార్గం లేక, అప్పో సొప్పో చేసి ఎలాగైనా అక్కడే చదివించాలని నిర్ణయించుకున్నారు.”

ప్రైవేట్ దోపిడీ

- విచ్చలవిడిగా ఫీజుల వసూళ్లు
- చిన్న తరగతులకూ రూ. వేలల్లో
- యథేచ్ఛగా యూనిఫాం, పుస్తకాల అమ్మకాలు
- నిబంధనలు పాటించని పాఠశాలలు



జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకుండా పోయిం ది. ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణ లేకుండా పో యింది. ఫీజులు కాదు పాఠశాలలోనే యూనిఫాంలు, టై, బెల్టులు, పుస్త కాలను సైతం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇవి విద్యార్థుల తల్లిదం డ్రులకు భారంగా మారుతున్నాయి. యూనిఫాంలు, పుస్తకాల అమ్మకాలపై ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడం లేదు. మార్కెట్‌లో రూ. 30కి దొరికే నోటుబుక్ పాఠశాలలో రూ. 65కు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాల నా యకులు ఆరోపిస్తున్నారు. యూనిఫాంలు, స్టేషనరి వాళ్ల అమ్మినవే కొనే లా చేస్తున్నారని, బయటి ధరలకంటే అధిక ధరలకు విక్రయి స్తున్నారని వి ద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

● జిల్లాలో ప్రైవేటు పాఠశాలల సంఖ్య..

జిల్లా వ్యాప్తంగా 293 వివిధ ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఇందులో 15 ప్రాథమిక పాఠశాలలు, 149 ప్రాథమికోన్నత పాఠశాలలు, 129 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో సుమారు 68,019 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాలల్లో 3,072 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 16,996 మంది, ఉన్నత పాఠశాలల్లో 47,951 మంది విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో 3,257 మంది ఉ పాధ్యాయులు పనిచేస్తుండగా ఇందులో ప్రాథమిక పాఠశాలల్లో 146 మం ది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,036 మంది, ఉన్నత పాఠశాలల్లో 2,075 మంది ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నట్లు విద్యాశాఖ రికార్డులు తెలుపుతున్నాయి.

● నిబంధనలు బేఖాతరు..

జిల్లాలో సుమారు ఎనభై శాతం పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదు. కేవలం ఇరవై శాతం లోపు పాఠశాలలు మాత్రమే రూల్స్ పాటి స్తున్నాయి. ప్రధాన రహదారుల పక్కనే కొనసాగుతున్న స్కూళ్లకు, ప్రహారి లేకుండా ఉన్న స్కూళ్లకు సైతం ట్రాఫిక్ నో అబ్జన్ సర్టిఫికేట్లు ఇస్తున్నా రన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో ఇరవై శాతం మినహా మిగిలిన పాఠశా లల్లో ఆట స్థలం ఉండడం లేదు. ఆట స్థలం ఉన్నప్పటికీ పలు పాఠశా ల ల్లో పీఈటీలు ఉండడం లేదు. అనుమతుల సమయంలో బీఈడీ, పీజీ స ర్టిఫికేట్లు ఉన్న వారిని చూపించి..అర్హత లేని వారితో పాఠాలు చెప్పిస్తు న్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల వివరాలు, రిక్గ్నైజేషన్, రెన్యూవల్ సర్టిఫికేట్లు అందజేయకపోయినప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనిపలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

● విద్యాహక్కు చట్టం అమలేదీ...

విద్యాహక్కు చట్టం సెక్షన్-6 ప్రకారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ -11లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశా లల యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలి. వసూలు చేసే ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్-12 ప్రకారం విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి 1-20 కి మించరాదు. ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగు లు, మైనార్టీలకు కేటాయించాలి. పాఠశాల యాజమాన్యాలు నోట్ బుక్స్ యూనిఫాం, బ్యాగులు, ఇతర స్టేషనరీ అమ్మరాదు. ఇవేవీ సక్రమంగా అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

● ఫీజుల నియంత్రణ పట్టదా...

కార్పొరేటు, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక వ్య వస్థ అంటూ ఏమీ లేదు. దీంతో ఆయా విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీ జులను వసూలు చేస్తూ పోతున్నాయి. భారీగా పెరిగిన ఫీజులతో సామా న్య ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీ జుల నియంత్రణకు తమిళనాడు, కర్ణాటక, మహరాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ సహా 15 రాష్ట్రలలో అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టా లు తెచ్చాయి. తెలంగాణ కూడా ఇదే తరహా చట్టాలను తెస్తే తప్ప ఫీజుల నియంత్రణకు చెక్ పడే అవకాశం కనిపించడం లేదని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

● రెసిడెన్షియల్స్ నిర్వహణలో నిబంధనలు తుస్...

జిల్లాలో పలు ప్రైవేటు పాఠశాలలు ఎటువంటి అనుమతి లేకుండా హా స్టల్స్‌ను నిర్వహిస్తున్నాయి. హాస్టల్ పేరుతో అదనపు ఫీజులను గుంజుతు న్నాయి. ప్రైవేటు హాస్టల్ నిర్వహణకు పలు ప్రభుత్వ శాఖల నుంచి అను మతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఎటువంటి సౌక ర్యాలు లేని భవనాల్లో హాస్టల్స్ నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బం దులకు గురవుతున్నారు. జిల్లాలో ఒకటి, రెండు మినహా ఏ పాఠశాలకు రె సిడెన్షియల్ అనుమతి లేనట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 80 వరకు రెసిడెన్షియల్ పాఠశాలలున్నట్లు అంచనా. నాణ్యమైన భోజనం, వి ద్యా, వైద్యం, రక్షణ తదితర వసతులను కల్పించాల్సి ఉన్నప్పటికీ యాజ మాన్యాలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

నియంత్రణ కరువు
- అంగిడి కుమార్, పీడీఎస్‌యూ, జిల్లా అధ్యక్షుడు



ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేయరాదు. అధిక ఫీజులను సామాన్యులు చెల్లించలేని పరిస్థితి తయా రైంది. ఇటీవలనే ఓ విద్యా సంస్థ అధిక ఫీజుల వసూళ్లపై డీఈవో దృష్టికి తీసుకెళ్లాము. పలు పాఠశాలల్లో పుస్తకాలు ఇష్టారీతిగా విక్రయిస్తూ అక్ర మ దందా చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ జరపాలి.

దోపిడీని అరికట్టాలి
- దొనికెల నవీన్, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,



ప్రైవేటు పాఠశాలల దోపిడిని ప్రభుత్వం అరికట్టాలి. గతంలో పలు కమిటీల నియామకం చేసినప్పటికీ అమలు పట్టించుకోవడం లేదు. జిల్లా స్థాయిలో ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో మౌలిక వసతులు, అర్హులైన ఉపాధ్యాయులు, గ్రంథాలయం, ఆట స్థలం నిబంధనల ప్రకారం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

జగిత్యాల కలెక్టర్‌గా సత్య ప్రసాద్
యాస్మిన్ బాషా బదిలీ



జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కలెక్టర్‌గా బుదుమజ్జి సత్య ప్రసాద్‌ను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను బ దిలీ చేయడంతో పాటు ఆమె స్థానంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ)గా పనిచే స్తున్న 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సత్యప్రసా ద్‌ను నియమించారుర. బుదుమజ్జి విజయ నిర్మ ల -అక్కు నాయుడు దంపతులకు సత్య ప్రసాద్ 1993 జూన్ 9వ తేదీన జన్మించాడు. రూర్కీ ఐఐటీ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేశాడు. 2016లో సత్యప్రసాద్ ఐఆర్ఎస్ సాధించాడు. సంవత్సరం పాటు ఐఆర్ఎస్ శిక్షణ తీసుకున్నాడు. అనంతరం సత్య ప్రసాద్ సివిల్స్‌లో 313 ర్యాంకు సాధించాడు. తల్లి విజయ నిర్మల ప్రోత్సాహంతో ఐఏఎస్‌లో సాధించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో శిక్షణ ఐఏఎస్ అధికారిగా పనిచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ)గా 2020 ఆగస్టు 5వ తేదీ నుంచి 2023 సెప్టెంబరు 9వ తేదీ వరకు పనిచేశారు. 2023 సెప్టెంబరు 10వ తేదీన ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బదిలీపై వెళ్లి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పదోన్నతిపై జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈనెల 16వ తేదీన జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలో సత్య ప్రసాద్ బాధ్యతలు తీసుకోనున్నారు.

అడిషనల్ కలెక్టర్ బదిలీ

జగిత్యాల అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీ)గా పనిచేస్తున్న టీఎస్ దివాకర పదోన్నతిపై ములుగు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దివాకర సుమారు యేడాది కాలంగా జగిత్యాలలో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేశారు. పదోన్నతిపై ములుగు కలెక్టర్‌గా నియామకమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించనుండడం సంతోషంగా ఉందని, వచ్చే ఒకటి, రెండు రోజుల్లో ములుగులో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

జగిత్యాల మున్సిపాలిటీలో ప్రొటోకాల్ రగడ

జగిత్యాల టౌన్, జూన్ 15: జగిత్యాల మున్సిపల్‌లో శనివారం ప్రొటోకాల్ వివాదం చోటు చేసుకుంది. బక్రీద్ పండుగను పురస్కరించుకుని ప్లాస్టిక్ కవర్ల రహిత పంపిణీ ప్రారంభ కార్యక్రమంపై వైస్ చైర్మన్ గోళి శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్ పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోళి శ్రీనివాస్ హాజరు కాకుండానే కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, కౌన్సిలర్ రజియోద్దీన్, చైర్ పర్సన్ భర్త అడువాల లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు మన్సూర్, షకీల్, అజహర్, కమాల్ తదితరులు హాజరై ప్లాస్టిక్ రహిత కవర్ల పంపణీని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న వైస్ చైర్మన్ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లకు బదులు వారి కుటుంబ సభ్యులు అధికారిక కార్యక్రమంలో పాల్గొనడంపై మండిపడ్డారు. కలెక్టర్‌కు మున్సిపల్ అధికారులపై ఫిర్యాదు చేయనున్నట్లు వైస్ చైర్మన్ పేర్కొన్నారు.

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

కథలాపూర్, జూన్ 15 : మండలంలోని భూషణ రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత ఉన్నత పాఠశాలలో చదువుతున్న కూన శ్రీహిత అనే విద్యార్థిని జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకం కింద ఎంపికైన విద్యార్థుకు 9వ తరగతి నుంచి ఇంటర్ దాకా ఏటా రు 12 వేల చొప్పున ఉపకారం వేతనం పొందుతారు. జిల్లాలో 69 మంది ఎంపిక కాగా ఎస్సీ విభాగంలో శ్రీహిత టాప్ ర్యాంక్‌లో నిలిచిందని హెచ్ఎం రాజయ్య తెలిపారు. శ్రీహితను ఉపాధ్యాయులు, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు శాలువాతో సత్కరించారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం


మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న విప్

ధర్మపురి, జూన్ 15: అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ విచ్చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు లక్ష్మణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
జిల్లా సంక్షేమ అధికారిణి వాణి శ్రీ

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా సంక్షేమ అధికారిణి వాణి శ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని సీనియర్ సిటిజన్ శాఖ జిల్లా కార్యాలయంలో 12వ ప్రపంచ వయోధికులపై వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. 16 మంది విశిష్ట వయోవృద్ధులను, ఆరుగురు ఉత్తమ కూతుర్లను, ఆరుగురు ఉత్తమ కుమారులను శాలువలతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వయో వృద్ధులను వేధిస్తే చట్టపర మైన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లి దండ్రులను నిరాదారణకు గురిచే స్తే 3 నెలలకు పైగా జైలు శిక్షతో పాటు జరిమానా విధించే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, నాయకులు హన్మంత రెడ్డి, వెలముల ప్రకాశ్, యాకూబ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన జూనియర్ లెక్చరర్లు

జగిత్యాల టౌన్, జూన్ 15: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇంటర్ మూల్యాంకన కేంద్రం మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని శనివారం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం తమ సమస్యలను జూనియర్ లెక్చరర్లు ఎమ్మెల్సీకి వివరించారు. జవాబు పత్రాలు పొందుపరిచేందుకు గాను ప్రత్యేక భవనం కావాలని ఎమ్మెల్సీకి వివరించారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల టౌన్, జూన్ 15: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య మూత్ర సమస్య వ్యాధితో కొన్ని రోజులుగా బాధపడుతున్నాడు.

ఈ సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం మంజూరైన రూ. 75 వేల ఎల్‌వోసీ పత్రాన్ని శనివారం నర్సయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలె చందు ఉన్నారు.











మియాపూర్‌లో మహిళ ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 15: సుల్తానాబద్ మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన సీపతి అంజలి(36) అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మియాపూర్ గ్రామానికి చెందిన అంజలికి కాట్నపల్లికి చెందిన శ్రీనివాస్‌తో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా కొన్నేళ్ల నుంచి అంజలి మియాపూర్‌లో ఉంటోంది. శనివారం ఉదయం ఉపాధి పనికి వెళ్లి ఇంటికి వచ్చిన అంజలి కొంత సేపటికి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మొదట పెద్దపల్లి అసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కరీంనగర్‌లో డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించినట్లు మృతురాలి సోదరుడు సతీష్ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు ఉన్నారు. అంజలి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.


రవాణా శాఖ ఆధ్వర్యంలో
వాహనాల తనిఖీలు

తిమ్మాపూర్, జూన్ 15: రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వి ద్యా సంస్థల వాహనాలతో పాటు ఇతర వాహనాల తనిఖీ కొనసాగాయి. శనివారం నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 8 వాహనాలను సీజ్ చేసినట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. ఇందులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న విద్యా సంస్థల బస్సులు 3, టాక్స్ లేకుండా నడుస్తున్న వాహ నాలు 4, ట్యాక్స్ చెల్లించని ట్రాక్టర్ ట్రాలీని సీజ్ చేసి జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి తరలించినట్లు డీటీసీ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎంవీఐలు జె ప్రమీల, బి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.













ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

- కిటకిటలాడిన నరసింహుడి ఆలయం

ధర్మపురి, జూన్ 15: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతరంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబం ధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. క్షేత్ర నలుమూలల నుం చి ఉదయం వరకు భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామి ద ర్శనం చేసుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగో లు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పం డితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభి షేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జూన్ 15: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలను ముదిరాజ్‌ల ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహింస్తున్నారు. శనివారం గ్రామంలో అమ్మవారిని పూర్వ వీధుల గుండా నిర్వహకులు డప్పుచప్పుళ్ల మధ్య ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆల యంలో అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు, హారతి కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భం గా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేంద ర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజి రెడ్డి పాల్గొని అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. నిర్వాహకులు శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దీవెనలతో వర్షాలు సమృద్ధిగా కు రిసి పాడి పంటలు పండి గ్రామస్థులు సంతోషంగా ఉండాల న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిటి రాజేందర్, రెండ్ల రమేష్, శ్రీనివాస్, జెట్టి లక్ష్మణ్, నరేష్‌రెడ్డి, దొంతుల శ్రీకాంత్, జంగిడి శ్రీధర్, పల్లికొండ వినోద్, పాల్గొన్నారు.

'మైనార్టీ గురుకులాల్లో అక్రమ అడ్మిషన్లను రద్దు చేయాలి'

కరీంనగర్ టౌన్, జూన్ 15: మైనార్టీ గురుకులాల్లో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను రద్దు చేసేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులు జోక్యం చేసుకోవాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్‌హుస్సేన్ డిమాండ్ చేశారు. 75శాతం ముస్లిం మైనార్టీలతో భర్తీ చేయాల్సిన సీట్లలో నాన్ మైనార్టీలతో భర్తీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ అడ్మిషన్ల వ్యవహారంలో వేలాది రూపా యల చేతులు మారుతున్నాయన్నారు. కరీంనగర్ జిల్లాలోని మైనార్టీ గురుకులా ల్లోనే అక్రమాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. చొప్పదండి నియోజకవర్గానికి చెందిన ఓ పార్టీ నేత ఫోన్‌తో 12 అడ్మిషన్లు ఎలా పొందారో, ఇప్పటికప్పుడు 120 మంది మైనార్టీలు కాని వారిని తీసుకోవాలని టిమ్రీస్ హెడ్ ఆఫీస్ నుంచి ఆదేశాలు ఏ విధంగా జారీ చేశారో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. మైనార్టీయేతర విద్యార్థులకు అక్రమ అడ్మిషన్లు ఇచ్చి మైనార్టీ గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్రలను చూస్తూ ఊరుకోబోమని అహ్మద్‌హుస్సేన్ హెచ్చరించారు. ఈవ్యవహారాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరొద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

మల్యాల, జూన్ 15: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

తాగునీటి కోసం గిరిజనుల కష్టాలు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గిరిజనులు

వీర్నపల్లి, జూన్ 15: వీర్నపల్లి మండల పరిధిలో ని రాశిగుట్ట తండా గిరిజ నులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతు న్నా రు. అధికారులు ఏర్పాటు చేసిన ట్యాంకర్ల నీరు సరి పోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు. తండా గిరి జనులకు సరిపడా తాగు నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారు లను వేడుకుంటున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్




పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న ఆటో డ్రైవర్

జగిత్యాల టౌన్, జూన్ 15: రహదారిపై దొరికిన నగదును పోగొట్టుకున్న వ్యక్తికి అందించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో లెల్లెల బాలకృష్ణ అనే వ్యక్తి బైక్‌పై వెళుతూ తన జేబులోంచి రూ. 21,100 నగదును పోగొట్టుకున్నాడు. అదే సమయంలో అటుగా ఆటో నడుపుతూ వస్తున్న ఆటో డ్రైవర్ గడ్డం శ్రీనివాస్ రోడ్డుపై పడిఉన్న నగదును గమ నించి విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రాజమౌళికి అందజేశాడు. పోగొట్టుకున్న వ్యక్తి బాలకృష్ణగా గుర్తించి నగదును ఆటో డ్రైవర్ చేతుల మీదుగా అ ందజేశారు. తన నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్‌ను పోలీసులు అభినందించారు.

అప్పుడు 9.8...ఇప్పుడు 10 జీపీఏ

- రీ వెరిఫికేషన్‌తో సవరించిన బోర్డు- ఖని విద్యార్థిని శరణ్యకు 10జీపీఏ



బోర్డు సవరించి విడుదల చేసిన శరణ్య మార్కుల మెమో

(ఇన్‌సెట్‌లో శరణ్య)

కోల్‌సిటీటౌన్, జూన్15: ఎస్సెస్సీ బోర్డు తప్పిదంతో ఓ ప్రతిభ కలిగిన విద్యార్థిని 10జీపీఏకు దూరం కావాల్సి వచ్చింది... తొలుత 9.8 జీపీఏగా బోర్డు ప్రకటించగా విద్యార్థి ప్రతిభపై ఉన్న నమ్మకంతో యాజమాన్యం రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా మార్కుల్లో తప్పిదం జరిగిందని బోర్డు సరివరించి సరిదిద్దుకుంది.. శనివారం 10జీపీఏ ఉత్తర్వును జారీ చేసింది.పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన పదవతరగతి విద్యార్థిని చకిలం శరణ్యకు రీ వెరిఫికేషన్‌లో 10జీపీఏ సాధించింది. ఈ మేరకు ఎస్సెస్సీ బోర్డు శనివారం సవరించిన మార్కులను విడుదల చేసింది. ఫలితాల్లో 9.8 జీపీఏగా బోర్డు ప్రకటించడంతో పాఠశాల యాజ మాన్యం అనుమానంతో విద్యార్థి ప్రతిభపై ఉన్న నమ్మకంతో బోర్డుకు రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చే సింది. విద్యార్థినికి సైన్స్ మినహా అన్ని సబ్జెక్టుల్లో 10 పాయింట్స్ వచ్చాయి. కాగా రీ వెరిఫికేషన్‌తో 74 మార్కులకు గాను 70గా ముద్రించింది 9.8గా ప్రకటించింది. కాగా ఎస్సెస్సీ బోర్డు జరిగిన తప్పిదాన్ని సవరించి 74గా ప్రకటిస్తూ 10 జీపీఏగా ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.విజయానంద్ తెలిపారు.

వర్షాలు కురువాలని గ్రామదేవతలకు జలాభిషేకం



వెల్లుల్లలోని హనుమాన్‌కు నీటితో అభిషేకం చేస్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, జూన్ 15: మండలంలోని వెల్లుల్ల గ్రామం లోని మహిళలు సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో విలసిల్లాలని కోరుతూ శనివారం గ్రామ దేవతలకు జలాభి షేకం చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు నీళ్ల బిందెలతో గ్రామంలో డప్పు చప్పులతో ఊరేగింప ుగా వెళ్లి పోచమ్మ, మైసమ్మ, శివాల యం, లక్ష్మీనర్సింహ, హనుమాన్ ఆల యాల్లోని ఉత్సవ మూర్తులకు నీటితో అభిషేకం చేసి ప్ర త్యేక పూజలు జరి పారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామస్థు లందరూ ఆయురా రోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని దేవుళ్లను కోరుకుంటూ జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యు లు, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

- వరంగల్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ కేఎస్ గుట్ట

హుజూరాబాద్, జూన్ 15: విద్యుత్ వినియోగదారుల సమస్యలను విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని వరంగల్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ కేఎస్ గుట్ట అన్నారు. హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటర్ల లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్పడం, హైఓల్టేజీ, క్యాటగిరి మార్పిడి, విద్యుత్ సరఫరాలో అంతరాయం, కొత్త సర్వీసులు ఇవ్వడంలో జాప్యం చేయ కూడదన్నారు. విద్యుత్ వినియోగదారుల కోసమే పరిష్కా ర వేదిక నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం పలువురు విద్యుత్ వినియోగదారులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. పరిశీలించి పరిష్కరించానలి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చరణ్‌దాస్, నరేందర్, డీఈ లక్ష్మారెడ్డి, ఏఈలు వీరాచారి, శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి చేనేత కార్మికుడి ఆత్మహత్య



వెంకటేశం(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 15: పనులు లేకపోవటంతో ఆర్థిక ఇబ్బ ందులతో చేనేత కార్మికుడు బొల్లబత్తిని వెంకటేశం(54) శనివారం రైలు కిందపడి కొత్తపల్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటేశం శనివారం వేకువజామున కొత్తపల్లి రైల్వేట్రాక్‌పై వెళ్తున్న గూడ్స్ రైల్ కింద పడ్డాడు. వెంకటేశం రాజన్న సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. అక్కడే పనిచేసుకుంటూ వారానికి ఒకసారి ఇంటికివచ్చి తిరిగి వెళ్లేవాడు. 6 నెలల నుంచి అక్కడ పనిలేనందున కొత్తపల్లిలోనే ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. పిల్లల చదువుల కోసం 2 లక్షల అప్పు చేశాడు. పనిలేక మనస్థాపంతో ఉన్న వెంకటేశం తాను సిరిసిల్లకు వెళ్ళి పని వెతుక్కుంటానని కుటుంబ సభ్యులకు చెప్పి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం కొత్తపల్లి రైల్వేట్రాక్‌పై వెంకటేశం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంకటేశంకు కూతురు, కొడుకు, భార్య ఉన్నారు. కూతురుకు పెళ్ళిచేయలేక, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది వెంకటేశం ఆత్మహత్య చేసుకు న్నాడని మృతుడి భార్య ఇందిర రామగుండం రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి పంచనామా నిర్వహించిన రామగుండం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జికి పొంచి ఉన్న ముప్పు

- తాత్కాలిక రోడ్డు కోసం వేసిన ఇసుకను తొలగించని అధికారులు
- వరద వస్తే కూలి పోయే ప్రమాదం



తాత్కాలిక రోడ్డు కోసం వేసిన ఇసుక

గంగాధర, జూన్ 15: అధికారుల నిర్లక్ష్యంతో బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉంది. గత ఏడాది దసరా పండుగ సందర్భంగా బతుకమ్మలు వేయడా నికి ఈ బ్రిడ్జి నుంచి కిందకు వెళ్లేందుకు తాత్కాలికంగా ఇసుక వేసి రోడ్డు వేశారు. అనంతరం దాన్ని తొలగించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసి భారీగా వరదనీరు చేరితే ఇబ్బందులు తలెత్తనున్నాయి. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో బ్రిడ్జి గంగాధర, పెగడపెల్లి మండలాలకు వారధిగా ఉంటుంది. నిత్యం ఈ రహదారిపై నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. గతేడాది ఎగువన కురిసిన వర్షాలకు రిజర్వాయర్ మత్తడి నుంచి భారీగా వరద రావడంతో బ్రిడ్జి కొట్టుకు పోయింది. దీంతో వారం రోజుల పాటు రాకపోకలు నిలిచి పోయాయి. శిథిలావస్థలో ఉన్న ఈ బ్రిడ్జికు అధికారులు మరమ్మతులు చేయించాలని, తా త్కాలికంగా వేసిన ఇసుకను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

రామడుగు, జూన్ 15: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రా మానికి చెందిన కత్తెరపాక కనుకయ్య (45) అనే రైతు చి కిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ సురేందర్ తెలి పిన వివరాల ప్రకారం.. దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కనుకయ్య ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్య వసాయం చేస్తున్నాడు. గత సంవత్సరం కురిసిరన అకా ల వర్షానికి పంట నష్టం వాటిల్లింది. పెట్టుబడులు సైతం రాలేదు. అంతకు ముందు ఉన్న అప్పు వడ్డీతో కలిసి సుమారు 8లక్షల రూపాయలు వరకు పెరిగి పోయింది. అప్పుఎలా చెల్లించాలనే మనస్తాపంతో గత నెల 30న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికి త్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కనుకయ్య భార్య మణెమ్మ ఫిర్యాదు మే రకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారుల నిరసన

హుజూరాబాద్, జూన్ 15: హుజూరాబాద్ పట్టణంలోని బీసీ హాస్టల్ ఎదుట మున్సిపాలిటీ నిర్మించిన షెటర్లకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని పలువురు వ్యాపారులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం డబ్బాలు వేసుకొని ఉపాధి పొందుతున్నామని చెప్పారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ షెటర్ల నిర్మాణం చేపడుతా మని డబ్బులు తీసుకొని సగంలోనే వదిలేశారని వాపోయారు. మిగితా షెటర్ల నిర్మాణం పనులను తామే సొంత డబ్బులతో నిర్మించుకున్నామన్నారు. గత పదిరోజు లుగా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఒక్కో షెటర్‌కు రూ. 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయం మున్సిపల్ కమిషనర్‌కు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. డబ్బులు ఇవ్వకుంటే పాలకవర్గం వేరే వ్యక్తులకు షెటర్లను అప్పగిస్తామని తరుచూ బెదిరిస్తున్నా రన్నారు. రోజు కూలీ చేసుకునే తమను డబ్బుల కోసం పాలకవర్గ సభ్యులు బెదిరించడం సరికాదన్నారు. మున్సిపల్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, ప్రదీప్, అంకూస్, రఘుచారి, రమేష్, రవీందర్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 15: హకీంపేట ప్రాంతీయ క్రీడా పాఠశాల, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడా అధికారి బి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మూడో తరగతి పాసై నాల్గవ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపిక విధానం మూడు స్థాయిల్లో జరుగుతుందని పేర్కొన్నారు. మొదట మండల స్థాయిలో ఏడు అంశాలలో పోటీలను నిర్వహి స్తారన్నారు. ఇందులో అర్హత సాధించిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొం టారన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి వారు రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారన్నారు. మండల స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు, జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి డాక్టర్ అంబేద్కర్ స్టేడియం కరీంనగర్‌లో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 01.09.2015 నుంచి 31.08.2016 మధ్య జన్మించిన వారై ఉం డాలన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి తెలిపారు.

తాటిపల్లిలో రెండిళ్లలో దొంగతనం

మల్యాల, జూన్ 15: మండలంలోని తాటిపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో దొంగతనం జరిగింది. సిరిమల్ల రాజ్యలక్ష్మి ఇంటికి తాళం వేసి శుక్రవారం కుటుం బసభ్యులతో కలిసి తన తల్లిగారి ఇళ్లు ముత్యంపేటకు వెళ్లింది. అయితే శనివారం ఇళ్ల తాళాలు తీసి ఉండడంతో స్థానికులు సమాచారం అందించారు. రాజ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు వచ్చి చూసే వరకు తాళాలు పగులగొట్టి ఉండగా ఇంట్లో బీరువాలోని మూడున్నర తులాల బంగా రు వస్తువులతో పాటు రూ. ఏడు వేలు ఎత్తుకెళ్లారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ ఇంట్లో కూడా చోరీ జరిగింది. ఇంట్లో అద్దెకుంటున్న పిల్లి తిరుపతి గదితో పాటు లక్ష్మీనారాయణ ఇంట్లోనూ తాళం పగులగొట్టి బీరువాలోని తులం బంగా రు ఆభరణాలు, 11 తులాల వెండి వస్తువులతో పాటు రూ.70వేలు నగదు ఎత్తుకెళ్లిన్నట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

తిమ్మాపూర్, జూన్ 15: నర్సింగాపూర్ గ్రామంలోని శ్రీ అది పెరుమాండ్లు హనుమాన్ ఆలయం హుండీని దుండగులు చోరీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తోట మధు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శ్రీ ఆది పెరుమాండ్లు హను మాన్ ఆలయములో ఈ నెల 13వ ఆల యానికి వచ్చిన సందర్భంలో హుండీ కనిపించకపో వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

మేడిపల్లి, జూన్ 15: ద్విచక్ర వాహనం పై నుంచి పడి సట్ట రాజేందర్(40) అనేవ్యక్తి మృతి చెందాడు. వల్లపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ భార్య జల, పిల్లలతో తన పుట్టింటికి పోరుమల్ల వెళ్లింది. శుక్రవారం అర్ధరాత్రి రాజేందర్ భార్యకు ఫోన్ చేసి తాను పోరుమల్ల గ్రామా నికి వస్తున్నానని చెప్పాడు. భార్య రాత్రి ప్రయాణం వద్దని శనివారం ఉదయం రావాలని చెప్పింది. భార్య మాట వినకుండా రాజేందర్ బైక్‌పై పోరుమల్లకు వెళు తుండగా కట్లకుంట గ్రామం శివారులో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో రాజేం దర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందిచారు. భార్య జల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

వెల్గటూర్, జూన్ 15: కప్పారావుపేటలో జరిగిన దాడి సంఘటనలో ఎస్సీ ఎస్టీ కేసు నమోదైన ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా శనివారం వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. కప్పారావుపేటకు చెందిన గాజుల లచ్చయ్య, గాజుల రాకేష్‌లపై గత నెల 4న బీరు సీసాలతో దాడి చేసిన సంఘటనలో ముం జంపల్లికి చెందిన బైరం తరుణ్, బైరం కరుణ్ పనుగంటి మధుకర్ పరారీలో ఉన్నారు. శనివారం ముగ్గురు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసి ధర్మపురి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు ఎస్సై పేర్కొన్నారు. మెజిస్ట్రేట్ ముగ్గురికి 14 రోజుల రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

అధ్వానంగా రహదారి

- వెయ్యి మంది విద్యార్థుల కష్టాలు పట్టని పాలకులు
- వానాకాలం వచ్చిందంటే మోకాలిలోతు నీటిలో నడవాల్సిందే



అధ్వానంగా ఉన్న స్కూల్‌కు వెళ్లే దారి

కథలాపూర్, జూన్ 15: కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే ఉన్నది ఒకే ఒక దారి. వానాకాలం వచ్చిందంటే చదువుకునేందుకు వెళ్లాలంటే విద్యార్థులకు చుక్కలు కనిపి స్తున్నాయి. ఉధృతంగా వచ్చే వరద నీరు చూసి విద్యార్థులు భయ పడి పాఠశాలకు రోజుల తరబడి గైర్హాజరవుతున్నారు. దీంతో చదువులో వెనకబడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని విద్యార్థుల తల్లిదం డ్రులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఈ రోడ్డును బాగు చేస్తామని చెప్పడమే గానీ ఏ నాయకుడు కూడా నిధులు కేటాయిం చడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

● **విద్యార్థుల అవస్థలు..**

ఈ రోడ్డు వెంట వెళ్తేనే తప్ప పాఠశాలకు చేరుకోని పరిస్థితి నెలకొనడంతో వరదను సైతం లెక్క చేయడం లేదు. వరుసగా వర్షాలు కురిస్తే పైభాగం నుంచి భారీ వరద వచ్చి పాఠశాలల్లో చేరుతుంది.



మోకాలి లోతు నీటిలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

దారి వెంట మోకాలి లోతు వరద నీటిలో నడుచుకుంటూ కిలోమీటర్ దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఎన్నో సార్లు ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఈ విపత్కర పరిస్థితిని చూసినప్పటికీ స్పందించకపో వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మోడల్ స్కూల్‌లో 500 మంది, జూనియర్ కళాశాలలో 250, కస్తూర్బాగాంధీ పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతీరోజు వెయ్యి మంది వివిధ ప్రాంతా ల నుంచి వచ్చే విద్యార్థులు ఈ దారి వెంటే నడుస్తున్న నేపథ్యంలో రోడ్డును బాగు పరచడంలో శ్రద్ధ కనబరచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉపాధ్యా యులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షల సమయంలో వరదలోనే నడిచి విధిలేని పరిస్థితుల్లో పరీక్షలకు హాజరు కావాల్సి వస్తోందని వాపోతున్నారు. మండల సర్వసభ్య సమావేశాల్లో కూడా ఈ సమస్యపై చర్చ జరిగినప్పటికీ ఇంజినీర్లు సర్వేలు చేయడంలో అలక్ష్యం ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తోంది.

రోడ్డును బాగు చేయాలి..



విద్యార్థులు ఏటా వర్షాకాలంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. వానలు కురిసిన సందర్భాల్లో రోజుల తరబడి పాఠశాలకు రాని పరిసి ్తి ఉంది. కళాశాల, పాఠశాల ఆవ రణలో నీరు నిలిచి ఉండడంతో తరగ తుల నిర్వాహణకు ఆటంకం ఏర్పడు తోంది. రోడ్డు వెంట సిమెంట్‌తో కాలువ నిర్మించి మధ్యలో కల్వర్టులు నిర్మిస్తే సమస్య పరిష్కారం కావ డానికి అవకాశం ఉంది.

- రాయికంటి శేఖర్, కథలాపూర్

పారదర్శకతకు ప్రతీకగా మున్సిపాలిటీని నిలబెట్టాలి

- సాగు చేసే రైతులకే పెట్టుబడి సహాయం - ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా దక్కలేదు - ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జూన్ 15: పారదర్శకతకు ప్రతీకగా మున్సిపల్‌ను నిలబెట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందనే విషయాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హితవు పలికారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం ఎమ్మెల్సీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అదుపు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే అని పేర్కొన్నారు. జగిత్యాలలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాల విషయంలో ఎవరి మీద ఆరోపణలు చేయలేదని, తనకు నాలుగో వార్డులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు వస్తేనే జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకవెళ్లానని వివరించారు. గుమ్మడి కాయ దొంగ ఎవరూ అంటే భుజాలు తడుముకున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. జగిత్యాలలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే ఎమ్మెల్యేగా ఎలాంటి విచారణ చేపట్టారో సమాధానం చెప్పాలన్నారు. నాలుగు సంవత్సరాల్లో జగిత్యాల మున్సిపల్‌లో ఏ విధంగా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారో ప్రజలకు తెలుసునన్నారు. జగిత్యాలలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు నిర్మిస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్ర పోతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజమని ఓడితే ప్రజా సమస్యలపై పోరాడే హక్కే లేదన్నట్లుగా సంజయ్‌కుమార్ మాటలు అర్థమవుతున్నాయన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయిందని ఎమ్మెల్యే స్వగ్రామం అంతర్గాంలో సైతం మూడో స్థానంలో నిలిచిందని ఎద్దేవా చేశారు. సాగు చేయని గుట్టలు, పుట్టలకు పెట్టుబడి సహాయం ఇచ్చేది లేదని సర్కారు సొమ్ము అంటే అంత అలుసేమి కాదన్నారు. నిజమైన సాగుచేసే రైతులకే పెట్టుబడి సహాయం అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడంతోనే పంజాబ్ ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రధాని మోదీకి ఇకనైనా కనువిప్పు కలుగాలన్నారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, జగిత్యాల క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్సూర్, రూరల్ ఎంపీపీ మంగళారపు మహేష్, నాయకులు అడువాల లక్ష్మణ్, వల్లెపు మొగిలి, కమాల్, శేఖర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

బోరు వేసి నాలుగేళ్లు..
మోటారు ఏర్పాటుకు ఎన్నేళ్లు..?



నాలుగేళ్ల క్రితం వేసిన బోరు

కొడిమ్యాల, జూన్ 15 : మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి ఎదుట నాలుగేళ్ల క్రితం అధికారులు నీటి అవసరాలను తీర్చుకోవటానికి కోసం బోరు వేశారు. కానీ మోటారు ఏర్పాటును మాత్రం మరిచారు. బోరు వేసిన నాటి నుంచి మోటారు ఏర్పాటు చేయకపోవటంతో నిరుప యోగంగా మారింది. పశువుల ఆసుపత్రికి రైతులు తీసుకవచ్చే పశు వులకు నీటి అవసరాలకు మాత్రం బోరు ఉపయోగ పడటంలేదు. పశువులకు చికిత్స సమయంలో నీరు లేక తాము ఇబ్బందుల పాలవుతున్నామని పశు వైద్య సిబ్బంది సంబంధిత ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అం దించినా ఎవ్వరు పట్టించుకోలేదు. పశువుల చికిత్స కోసం వచ్చే రైతులు ఎవరికి వారు నీళ్ల దూరం నుంచి తెచ్చుకోవటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ మండల సమావేశాలలో బోరుకు మోటారు ఏర్పాటు చేయాలని వినతి చేసినా ఎవ్వరు పట్టించుకోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం, సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కొడిమ్యాల రైతులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలి : ఎంపీపీ

కొడిమ్యాల, జూన్ 15 : జాతీయ విపత్తుల నివారణ చర్యల గురించి వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ స్వర్ణలత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మురికి నీటి కాల్వల్లో చెత్త పేరుకు పోకుండ చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అంత సమన్వయంతో పని చేసినందునే మండలానికి అవార్డులు వచ్చాయన్నారు. వీధుల వెంట చెత్త చెదారం వేయకుండ ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. అంతక ముందు ఎంపీడీవో స్వరూప మాట్లాడుతూ ప్రజలు ఇళ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకునే విధంగా అవగాహన కలిపించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎంపీటీసీలు జగన్, మిరియ, ఎంఈవో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, ఏవో జ్యోతి, వెటర్నరీ వైద్యుడు ప్రసాద్, ఏఈ రఘునాథ్, ఇరిగేషన్ ఏఈఈ రాజేష్‌ఖన్నా, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్లాపూర్ నుంచి హైదరాబాదుకు
బస్సు సౌకర్యం కల్పించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్య వివరిస్తున్న కృష్ణారావు

కోరుట్ల, జూన్ 14: నియోజకవర్గంలోని మల్లాపూర్ మండల కేంద్రం నుంచొ హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యపై వివరించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతమైన మల్లాపూర్ మండలం నుంచి హైదరాబాద్‌లో విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థులు, నిరుద్యోగులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రవాణశాఖ మంత్రి పొన్నం దృష్టికి జువ్వాడి కృష్ణారావు తీసుకుపోయారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు కృష్ణారావు తెలిపారు.

భట్టిని కలిసిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, జూన్ 14: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కలిసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కను కలిసి సత్కరించారు. స్థానికంగా ఉన్న పార్టీ కార్యక్రమాల గురించి వివరించారు. నియోజకవర్గ పర్యటనకు రావాలని భట్టి విక్రమార్కను కోరినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అంటువ్యాధుల నివారణ కోసం ప్రత్యేక చర్యలు
- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కోరుట్ల, జూన్ 14 : అంటు వ్యాధుల నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టి పట్టణాలతో పాటు గ్రామాల్లో వైద్య పరీక్షలను నిర్వహిస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని జమితి ఇస్లామిక్ ఎంపీజే బిల్డింగ్‌లో ప్రభుత్వ వైద్యులతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో 120 మంది రక్త నమూనాలను సేకరించారు. వివిధ వైద్య పరీక్షల కోసం మరో 20 మంది రక్త నమూనాలు సేకరించి పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాల మున్సిపల్ ఆర్‌వో ప్రసాద్ సస్పెన్షన్

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన బి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిణి దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలో ఓ భూ వివాదంలో ఇరుక్కొన్న ప్రసాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పాటు అరెస్టు చేయడంతో సంబంధిత అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు ఆర్‌వో ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు బల్దియా వర్గాలు తెలిపాయి.

మాస్టర్ ప్లాన్ లేకుండా అస్తవ్యస్తంగా మార్చారు

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్, జూన్ 15: నలభై ఎళ్ల రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ జగిత్యాలకు సరైన మాస్టర్ ప్లాన్ లేకుండా అస్తవ్యస్తంగా మార్చిన నాయకుడు జీవన్ రెడ్డి అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదును పురస్కరించుకుని ప్రత్యేకాధికారులను నియమించి విచారణ చేపట్టాలని కోరుతూ కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పట్టణంలో ఎలాంటి అనుమతులు తేకుండా ఎన్నో అక్రమ నిర్మాణాలు జరిగాయన్నారు. బట్టీవాడలో పాఠశాల జోన్లో గృహ నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది ఎవరో అందరికి తెలుసునన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే జోన్లను మార్పు చేసామన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చే పరిస్థితి వస్తే జగిత్యాలలో భూకంపం వస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో డ్రైనేజీలు అస్తవస్త్యంగా మారడంతో పాటు పట్టణ శివారులో ఉన్న ముప్పారపు చెరువు మురుగు నీటితో పూర్తిగా చెడిపోయిందన్నారు. మోతె చెరువు కలుషితం కాకుండా వీక్లి బజార్ నుంచి డ్రైనేజీని నిర్మించామన్నారు. 2006, 2024 ఎంపీ ఎన్నికల్లో ఓటర్లు జీవన్‌రెడ్డిని తిరస్కరించారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా అనేక నిర్మాణాలు జరిగాయని వీటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవన్‌రెడ్డి ప్రతీకార చర్యలతో ఇచ్చిన ఫిర్యాదులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయ కులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఖండించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు వొల్లెం మల్లేశం, సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కొడిమ్యాల, జూన్ 15 : మండల కేంద్రానికి చెందిన మంచాల శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో, మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన బుసనవేని నాంపెల్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మృతుల కుటుంబ సభ్యులను శనివారం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్‌రెడ్డి టీపీసీసీ కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ స్వర్ణలత, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, నాయకులు చంద్రమొహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, జితెందర్‌రెడ్డి, కిషన్ రెడ్డి ఉన్నారు.

గుండె పోటుతో పురోహితుడు మృతి

మెట్‌పల్లి రూరల్, జూన్, 15 : మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన మునుగోటి మోహన్ శర్మ (64) అను ప్రముఖ పురోహితుడు గుండె పోటుతో శనివారం మృతి చెందాడు. ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాలకు ప్రధాన అర్చకుడుగా ఉంటూ మండలంలోని పలు గ్రామాలలోని ఆలయాల్లో జరిగే వేడుకలకు సేవలు చేసేవారు. మోహన్‌శర్మ మృతదేహానికి గ్రామాలలోని ప్రజలు నివాళులర్పించారు. ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు.

బక్రీద్ కోసం ఏర్పాట్లు

మెట్‌పల్లి, జూన్ 15: బక్రీద్ పండుగకు మెట్‌పల్లి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం వెంకట్రావుపేట గ్రామ సమీపంలోని ఈద్గా ను శుభ్రం చేయించారు. బక్రీద్ సందర్భంగా నమాజ్ చేయడానికి ఈద్గా వద్దకు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ముజీబ్, నర్సయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వరిసాగుపై సీఎం స్పష్టత ఇవ్వాలి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి

మెట్‌పల్లి, జూన్, 15 : వర్షాకాలపు వరి సాగు చేసే రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని ట్విట్టర్ ద్వారా కోరినట్లు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి తెలిపారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సన్న, దొడ్డు రకం వరికి బోనస్ అందజేయాలని విజ్ఞప్తి చేశానన్నారు. అదే విధంగా వరి సాగు చేస్తున్న రైతులకు గిట్టు బాటు ధరను ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, సూరజ్, నరేష్, నగేష్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లింబాద్రి

ఘనంగా వాసవీ మాత ఆలయ వార్షికోత్సవం



మెట్‌పల్లిలోని వాసవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

మెట్‌పల్లి, జూన్, 15 : పట్టణంలోని వాసవి మాత ఆలయం 44వ వార్షికోత్సవాన్ని ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో ఉదయం నుంచి నవగ్రహ పూజ, కల శపూజ, పంచామృత అభిషేకం, పూర్ణాహు తి వంటి కార్య క్రమాలను పురోహితులు ఆర్యవైశ్యులచే చేయించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు షైలారపు రాంబాబు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్మీ రవి, వా సవి దేవాలయం అధ్యక్షులు చాడ సురేష్, కోట కిరణ్‌కుమార్, పడిగెల శ్రీనివాస్, బండారి శివ, చాడ చందు, చిట్టిమిల్లి శ్రీనివాస్, ఎలగందుల సంతోష్, బండారి గోపి, లవకుమార్, జొన్న శ్రీనివాస్, పురోహితులు భాస్కర్ శర్మ, బాలకృష్ణశర్మ పాల్గొన్నారు.

'గోవధ చట్టరీత్యా నేరం'

మెట్‌పల్లి రూరల్, జూన్, 15 : గోవు పవిత్రమైందని, గోవు వధ చట్టరీత్యా నేరమని మండల పుశువైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్ అన్నారు. పశు సంరక్షణలో భాగంగా అక్రమంగా గోవుల రవాణాను అరికట్టడానికి పశు సంవర్ధక, పోలీసు అధికారులు సంయుక్తంగా శనివారం మండలంలోని గండిహనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అంతర జిల్లా సరిహద్దు చెక్ పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోషేధ, పశు సంరక్షణ చట్టం 1977 ప్రకారం గోవులను, దూడలను అక్రమంగా రవాణా చేసిన, ఉద్దేశపూర్వకంగా గోవధకు పాల్పడిన, సహకరించినా చట్టరీత్యా శిక్షార్హులేనని పేర్కొన్నారు. పశువులను రవాణా చేసిన, అమ్మిన వారితో పాటు కొన్నవారు కూడా శిక్షార్హులేనన్నారు. పోలీసు, పశు సంరక్షణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల తీరు హాస్యాస్పదం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్

జగిత్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వ వార్డులో అక్రమ నిర్మాణాలపై ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌లు ఆరోపణలు, ప్రత్యారోపణలతో వ్యవహరిస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. శనివారం పట్టణంలోని కమల నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై ఆమె ధ్వజమెత్తారు. కాలనీలో జరుగుతున్న ఒక అక్రమ కట్టడంపై సీనియర్ నేత జీవన్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం, వెనువెంటనే ఆ ఫిర్యాదుపై కౌంటర్‌గా ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలిసి మరో వినతిపత్రం అందించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వీరిద్దరూ స్వార్థ రాజకీయాలకు పాల్పడుతుండడం సమంజసం కాదన్నారు. ఒక కట్టడంపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హోదా మరిచి వ్యవహరిస్తుండడం ప్రజలు గమనిస్తున్నారని హితవు చేశారు. పట్టణంలో జరుగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా జగిత్యాల పట్టణానికి సుమారు 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు అయి నిర్మాణాలు పూర్తయినప్పటికీ నిరుపయోగంగా ఉన్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో కనీస వసతులు కరువయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీ అభివృద్ధిని ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ అమలు ఏమైందన్నారు. రూ. 700 కోట్లతో కోకో కోలా కంపెనీ పెద్దపల్లి జిల్లాలో కాకుండా అన్ని హంగులున్న జగిత్యాల జిల్లాలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదని, పాలకుల వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. కంపెనీకి ప్రధాన ముడి సరుకు అయినా మ్యాంగో మార్కెట్ జగిత్యాలలో ఉంది అని స్పష్టం చేశారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయ ప్రయోజనాలను వదిలిపెట్టి ప్రజల సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు నలువాల తిరుపతి, ఆముద రాజు, సిరికొండ రాజన్న, వీరభత్తిని అనిల్‌కుమార్, కొక్కు గంగాధర్, మ్యాదరి అశోక్, దురిశెట్టి మమత, గాదాసు రాజేందర్, మల్లేశ్వరీ, సింగం పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోగ శ్రావణి ప్రవీణ్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొడిమ్యాల, జూన్ 15 : గ్రామ పంచాయతీ సిబ్బందికి గత ఐదు ఆరు నెలలుగా పెండింగ్ ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందించిన సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం కలిపించాలని కోరారు. మల్టీపర్పస్ విదానాన్ని రద్దు చేస్తు పాత కేటగిరీల మాదిరిగా పనులను కొనసాగించాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా నాయకులు పులి మల్లేశం, సాత్ల రాజేందర్, మండల నాయకులు గుడిసె దేవయ్య, కనకరపు సత్తయ్య, కొత్తూరి కొండయ్య, నరేష్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్గటూర్, జూన్ 15: మండలం లోని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్‌లో సాంఘికశాస్త్రం బోధించుటకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు బోధించడానికి సిద్ధంగా ఉన్న వారు ఈ నెల 20 లోగా మాడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సాంఘికశాస్త్రం బోధించుటకు బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టు మెథడాలజీ ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 20 మధ్యాహ్నం డెమో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్సాహం, అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో(హెచ్‌బీటీ)హవర్లీ బేస్డ్ టీచర్లుగా బోదించిటకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18న ఉదయం పాఠశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ బి. లావణ్య కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆమట్లాడుతూ తెలుగు, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కామర్స్ 1 పోస్ట్ చొప్పున, టీజీటీ, ఇంగ్లీష్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పీజీటీ పోస్టుకు సంబందిత సబ్జెక్ట్‌లో పీజీ, బీఈడీ, టీజీటీ పోస్టుకు డిగ్రీ, బీఈడీ అర్హత ఉండి టెట్ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌తో పాటుగా హాజరు కావాలన్నారు. సంబందిత సబ్జెక్ట్‌లో డెమోకు సిద్దపడి రావాల్సి ఉంటుందన్నారు.

కేంద్ర మంత్రిని కలిసి కౌన్సిలర్

కోరుట్ల, జూన్ 14 : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని శనివారం కోరుట్ల మున్సిపల్ బీజేపీ కౌన్సిలర్ పెండం గణేష్ కలిసి సన్మానించారు. దేశ రాజదానిలోని పార్లమెంట్ భవనంలో మంత్రి కిషన్ రెడ్డి చాంబర్‌లో కలిసి పూలమాలలు శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా పార్టీ పరిస్థితులను మంత్రికి వివరించినట్లు పెండం గణేష్ తెలిపారు.

మోరపల్లి లో బడిబాట

జగిత్యాలరూరల్, జూన్ 15 : జగిత్యాల రూరల్ మండలంలోని ప్రైమరీ, హైస్కూల్‌ల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామ స్థులతో కలిసి ర్యాలీ తీశారు. ఈకార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, పంచాయితీ సెక్రటరీ రాజరెడ్డి, గ్రామస్థులు నరసింహారెడ్డి, గణేష్, పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధుల మంజూరు

కోరుట్ల రూరల్, జూన్ 14 : మండలంలోని 12 ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల అభివృద్ధి పనులకు 2023 - 24 సంవత్సరం బీపీడీపీ 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరు అయినట్లు ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీపీ తోట నారాయణ తెలిపారు. ప్రతి గ్రామంలో 2 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సుభాష్ రెడ్డి, గంగాధర్, కృష్ణారెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, గోపాల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కలికోట చెక్‌పోస్ట్ ఏర్పాటు
చేయాలని వినతి

కథలాపూర్, జూన్ 15 : హైకోర్టు గోవుల తరలింపును అడ్డుకోవాలని ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మండలంలోని కలికోటలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం ఎస్సై నవీన్‌కు బీజేవైఎం నాయకులు వినతి పత్రం అందించారు. గోవధను నిర్మూలించే క్రమంలో చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల మారుతి, మండల ప్రధాన కార్యదర్శి గంగ్ర అజయ్‌రావు, ప్రతాప్, ప్రమోద్, శ్రీకర్ ఉన్నారు.

సమస్యను పరిష్కరించండి

రాయికల్, జూన్ 15: రాయికల్ పట్టణంలో గల బాలికల పాఠశాలకు వెళ్లే దారిలో మురికి కాలువ సమస్యను పరిష్కరించాలని కోరుతూ 11వ వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ, నాయకులు మ్యాకల రమేష్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించారు. మురికి కాలువ సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మురికి కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి చేయూత

రాయికల్, జూన్ 15: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మ్యాడారపు అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో భార్య నందిని, 8 నెలల కూతురు రోడ్డున పడ్డారు. విషయం తెలుసుకున్న ఉదయం ఫౌండేషన్ సభ్యులు 25 కిలోల బియ్యం, 15 రకాల నిత్యావసర వస్తువులతో పాటు రూ.వెయ్యి నగదు అందజేసి చేయూత నందించారు. ఈ కార్యక్రమంలో ధనకంటి ఈశ్వర్, పంచాతి రాఘవ, కడ శ్రీధర్, మాండ్ల రాజేష్, ముద్దం స్వామి పాల్గొన్నారు.